ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 | కనిష్ఠం 15.07
నిర్మల్ జిల్లా వార్తలు

బుధవారం 20 నవంబరు 2024

ఇంటింటి సర్వే పారదర్శకంగా చేపట్టాలి

ముథోల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేను పారదర్శకంగా చేపట్టాలని మండల నోడల్ ఆఫీసర్ (సెస్ సర్వే) శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముథోల్‌లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సర్వే జరుపుతున్న ఎన్యూమరేటర్ల వద్దకు వెళ్లి సర్వే త్వరగా పూర్తి చేయుటకు గాను, పూర్తి పాదర్శకంగా చేయుటకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతీ ఇంటికి వెళ్లి పూర్తి వివరాలతో సర్వే చేపట్టాలన్నారు. అలాగే వీరి వెంట ఎంపీడీవో శివ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

• భానాపూర్ మండలంలో సర్వే నిర్వహణ తీరును పరిశీలిస్తున్న సీపీవో జీవరత్నం



లక్ష్యం దిశగా.. సర్వే

- జిల్లాలో 72.03 శాతం సర్వే పూర్తి
- ఇప్పటి వరకు 1.67 లక్షల కుటుంబాల వివరాల సేకరణ
- సర్వేకు ముందుకు రాని ఇథనాల్ ఫ్యాక్టరీ బాధితులు
- రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 2,31,859 లక్షల కుటుంబాలు

నిర్మల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లక్ష్యం దిశగా సాగుతోంది. ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సర్వే మొదట్లో మందకొడిగా సాగినప్పటికీ.. క్రమక్రమంగా వేగం పుంజుకుంది. ఇప్పటి వరకు 72.03 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 2,31,859 లక్షల కుటుంబాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 1,67,220 లక్షల కుటుంబాలను ఎన్యూమరేటర్లు సర్వే చేశారు. జిల్లావ్యాప్తంగా 1,634 మంది ఎనూమరేటర్ల ను సర్వే కోసం నియమించారు. ప్రతీ పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్‌ను నియమించి సర్వేను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు ఆరుగురు నోడల్ అధికారులను సైతం సర్వే కోసం ప్రత్యేకంగా నియమించి రోజు వారి సమీక్ష జరిపే విధంగా చర్యలు చేపట్టింది. కాగా ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి స్టిక్కర్లను అతికించారు. మూడు రోజుల పాటు ఈ ప్రక్రియను పూర్తి చేసిన ఎన్యూమరేటర్లు.. మరుసటి రోజు నుంచి అనగా 9వ తేదీ నుంచి సర్వేను మొదలుపెట్టారు. గత పదకొండు రోజుల నుంచి ఈ సర్వే నిరాటకంగా కొనసాగుతోంది. ఒకటి రెండు చోట్ల మినహా అందరు సర్వేకు సహకరించి తమ వివరాలు నమోదు చేయిస్తున్నారు. కొంత మంది మాత్రం ఆస్తులు, అప్పులతో పాటు ఆదాయ వివరాలను స్పష్టంగా వెల్లడించక పోతున్నప్పటికీ.. మెజార్టీ ప్రజలు తమ వివరాలను స్పష్టంగా వెల్లడిస్తున్నారంటున్నారు. ఎన్యూమరేటర్లు ఒక్కో ఇంటి వద్ద దాదాపు ఇరవై నిమిషాల నుంచి అరగంట వరకు వివరాల సేకరణలో నిమగ్నమవుతున్నారు. కాగా వివరాల నమోదుకు కోడ్‌లు ఉన్న కారణంగా ఎన్యూమరేటర్లు కొంత ఇబ్బందిని ఎదు ర్కొంటున్నారంటున్నారు. అయినప్పటికీ ఓపికగా పూర్తి వివరాలను నమోదు చేస్తున్న ట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. కులంతో పాటు ఇతర వివరాలను సక్రమంగానే వెల్లడిస్తున్నప్పటికీ.. మరికొన్ని విషయాల్లో మాత్రం చాలా మంది దాటవేత వైఖరిని అవలంబిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మొత్తానికి అధికారుల నిరంతర పర్యవేక్షణతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే మిగతా జిల్లాల కన్నా నిర్మల్ జిల్లాలో ఎక్కువ శాతం సర్వే పూర్తి అవ్వడంతో ఇక్కడి అధికారులు ఈ ప్రక్రియలో మరింత వేగం పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నిర్దేశిత గడువులోగా సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేసేందుకు ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

సర్వేకు ముందుకు రాని పలువురు

ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్న దిలావర్‌పూర్, గుండంపెల్లి గ్రామాల ప్రజలు సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించడం లేదు. వీరంతా తాము సర్వేను బహిష్కరిస్తు న్నామంటూ ఇప్పటికే ప్రకటించారు. అయితే అధికారులు వీరిని ఒప్పించేందుకు పలుసార్లు ప్రయత్నాలు చేశారు. అయినప్పటికి ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను నిలిపివేస్తామంటూ అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తాము సర్వేలో పాల్గొనబోమంటూ పట్టుబడుతున్నారు. అంతేకాకుండా ఇటీవలే జిల్లా కలెక్టర్‌కు సైతం ఇథనాల్ ఫ్యాక్టరీ బాధిత రైతులతో స్వయంగా చర్చలు జరిపి వారిని ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినప్పటికి తమకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సర్వేలో పాల్గొనేది లేదంటూ మొండికేస్తున్నారు. దీంతో సంబంధిత అధికారులు సమస్య తీవ్రతను సర్కారు దృష్టికి తీసుకుపోయారు. ఇప్పటికి ఈ రెండు గ్రామాలకు సంబంధించి సర్వే పనులు ఎప్పుడు మొదలవుతాయోననే విషయంపై స్పష్టత రావడం లేదంటున్నారు.

లక్ష్యం దిశగా కార్యాచరణ

ఇదిలా ఉండగా జిల్లాలో మొత్తం 2,31,859 లక్షల కుటుంబాలు నివసిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ కుటుంబాలన్నింటిని సర్వే చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. దీనికి అనుగుణంగా 1,634 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. ఈ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ప్రతి పది మంది ఎన్యుమరేటర్‌కు ఓ సూపర్ వైజర్‌ను నియమించి ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. దీంతో పాటు జిల్లాలో ఆరుగురు నోడల్ అధికారులను సైతం నియమించారు. ఎప్పటికప్పుడు సర్వే ప్రక్రియ ప్రగతిపై జిల్లాకు చెందిన ఉన్నతాధికారులతో పాటు స్వయంగా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు జరుపుతూ సర్వే పురోగతిని సమీక్షిస్తున్నారు.

ఎన్యూమరేటర్లకు తప్పని తిప్పలు

సర్వేలో వివరాలు ఎక్కువ సంఖ్యలో ఉన్న కారణంగా ఎన్యూమరేటర్లు ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. కాగా పలు కుటుంబాలకు చెందిన సభ్యులు పూర్తి వివరాలు ఇవ్వకుండా దాటవేత ధోరణి సమాధానాలు ఇస్తుండడంతో ఎన్యుమరేటర్లు ప్రతికూలతను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు. ముఖ్యంగా ఆస్తులు, అప్పుల విషయంలో చాలా కుటుంబాలు స్పష్టతనివ్వడం లేదంటున్నారు. దీని కారణంగా ఎన్యూమరేటర్లు వాటి వివరాల స్థానంలో నిల్ అని రాసి సరిపెడుతున్నారంటున్నారు. అలాగే చాలా మంది ఇళ్లకు తాళాలు వేసుకొని వెళ్లడం.. మరికొంత మంది అందుబాటులో లేకపోవడం కూడా ఎన్యూమరేటర్లను ఇబ్బందులకు గురి చేస్తోందని అంటున్నారు. అయితే అధికారులు తమకు కేటాయించిన కుటుంబాల సంఖ్యకు అనుగుణంగా ఎన్యూమరేటర్లు తమ సర్వే ప్రక్రియను మాత్రం పకడ్బందీగా చేపడుతున్నారు. ఒక్కో ఇంటికి రెండు మూడుసార్లయిన వెళ్లి సర్వే వివరాలను నమోదు చేస్తున్నారు. అలాగే అపార్ట్‌మెంట్‌లు, ఒకే ఇంటిలో అద్దెకు ఉంటున్న వారి వివరాల నమోదు విషయంలో కూడా ఎన్యుమరేటర్లు కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. వివరాలు చెప్పేందుకు వెనకాడుతున్న వారిని సముదాయిస్తూ సర్వే కారణంగా ఎలాంటి నష్టం లేదని వారిని అభయమిచ్చి వివరాలను నమోదు చేయిస్తున్న కారణంగా సమగ్ర సర్వే లక్ష్యాన్ని దాటే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.


19 DO5979

బాసర గ్రామ పంచాయతీ
ఈవో సస్పెన్షన్

బాసర, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): బాసర మేజర్ గ్రామపంచాయతీ ఈవోగా పని చేస్తున్న గోవింద్ రాజులును సస్పెన్షన్ చేస్తున్నట్లు మండల ఎంపీడీవో అశోక్ కుమార్ తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు ఉండడంతో జిల్లా అధికారులు విచారించి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎంపీవోగా పనిచేస్తున్న గంగా సింగ్‌ను ప్రస్తుతానికి బాసరకు ఇంచార్జీగా ఈవోగా నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఖానాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోసంపల్లె గ్రామంలో సోమవారం అర్ధరాత్రి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. తమకు అందిన రహస్య సమాచారం మేరకు ఆకస్మికంగా అర్ధరాత్రి దాడులు నిర్వహించగా గోసంపల్లె గ్రామంలోని ఒకరి వాకిట్లో రేషన్ బియ్యం బస్తాలు కనిపించాయన్నారు. బియ్యం ఎవరివని గ్రామంలో విచారణ చేయగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇప్పుడే వస్తామని వాకిట్లో బియ్యం బస్తాలు ఉంచి వెళ్లినట్లు స్థానికులు తెలిపారని ఎస్సై పేర్కొన్నారు. పట్టుకున్న రేషన్ బియ్యం సుమారు 15 క్వింటాళ్ల వరకు ఉంటాయని ఆయన తెలిపారు. రేషన్ బియ్యాన్ని ఎవరు అక్కడ వదిలి వెళ్లారనే అంశంపై విచారణ చేస్తున్నామన్నారు.

గుండంపల్లి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం


రోడ్డుకు ఇరువైపులా చెట్లు, పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండంపల్లి రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రూ.10 కోట్ల నిధులతో నిర్మించనున్న 61వ జాతీయ రహదారి నుంచి గుండంపల్లి వరకు రెండు వరుసల రోడ్డుగా విస్తరించేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ ఏడాది జూలై 2న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత రోడ్డు ఇరువైపులా వరి పంట పొలాలు ఉండటంతో పనులను నిలిపి వేశారు. వరి కోతలు మొదలు కావడంతో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. రెండు వరుసల రోడ్డు విస్తరిస్తుండటంతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా పనిలో పనిగా ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మూల మలుపులను తొలగిస్తూ రోడ్డు విస్తరణ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ ఫిజిక్స్‌పై సదస్సు

బాసర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ ఫిజిక్స్ పై మంగళవారం సదస్సు ప్రారంభించారు. ఆర్జీయూకేటీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీచర్స్ ట్రైనింగ్ రీసెర్చ్ చండీఘడ్ సంయుక్తంగా ఈ కార్యక్రమంను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో ఫిజిక్స్ పాత్ర ప్రధాన భూమిక వహిస్తుందని తెలిపారు. అధ్యాపకులు తమ తమ రంగాల్లో అత్యాధునిక సాంకేతికలో అప్డేట్, అప్‌గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. అయితేనే విద్యార్థులకు మెరుగైన సేవలు అందించగలుగుతామన్నారు. సిమ్యూలేషన్ టూల్స్ ప్రపోజల్ రైటింగ్ ఫిజిక్స్‌లో ఏఐ టూల్స్ క్రిస్టలోగ్రఫీ, మాగ్నెటిక్ మెటీరియల్స్ వంటి కొన్ని ఆసక్తికరమైన విషయాలను ఈ సదస్సులో చర్చించనున్నారు. సదస్సు కన్వీనర్ రాకేష్ రోషన్, ఏవో రణధీర్, వివిధ విభాగాల అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, నిర్వాహకులతో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ముగ్గుల పోటీలు


ముగ్గుల (రంగోలి) పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సందర్భంగా ఈ నెల 14 నుండి 20 వరకు నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల(రంగోలి) పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ ముగ్గుల పోటీల్లో జడ్పీహెచ్ఎస్ మంజులాపూర్, శాంతినికేతన్ హైస్కూల్, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఈద్గాం, సిద్ధార్థ ఒకేషనల్ కాలేజీ టీజీఆర్‌జేసీ సోఫీనగర్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 260 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొని విజేతలైన విద్యార్థినులకు నేడు (బుధవారం) ముగింపు సందర్భంగా బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమంలో చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ, కార్యదర్శి పి. బుగ్గా రెడ్డి, లైబ్రేరియన్స్ రాథోడ్ మోహన్ సింగ్, విజయశ్రీ, సంజీవ్ రెడ్డి, రాజు, విజయ శంకర్, లెనిన్, శంకర్, విశ్రాంత లైబ్రేరియన్ భూమన్న, దశరథ్ గౌడ్, శ్రీనివాస్ స్వామి, గంగాధర్, కిష్టారెడ్డి, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

చండీయాగంతో విజయాలు చేకూరాలి

• జిల్లా బీజేపీ అధ్యక్షుడు కూనింటి అంజు కుమార్ రెడ్డి

నిర్మల్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చండీయాగంతో ప్రజలందరికీ విజయం చేకూరి, ఆయురారోగ్యాలతో ఉండాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలో ప్రతి నిత్యం జరుగుతున్న శ్రీ వైష్ణవ ఆయుత చండీ, అతిరుద్రం 84వ విశ్వశాంతి మహా యాగ మహోత్సవంలో కూనింటి అంజు కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వారికి శ్రీ కృష్ణ కాలచక్రం పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ మంగళ శాసనాలు అందించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ప్రజలు చండీయాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. వీరితో పాటు పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, కమల్ నయన్, తల్వేద సర్పంచ్ తోకల అనిల్, మూడారపు దిలీప్ పాల్గొన్నారు.


చండీయాగంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కోడలిపై హత్యాయత్నం చేసిన మామకు జైలు

• ఎస్పీ జానకి షర్మిల

దిలావర్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వడం లేదనే కోపంతో సొంత కోడలి (కొడుకు భార్య)ని హత్య చేయడానికి ప్రయత్నించిన మామకు అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన బైండ్ల భోజన్న మద్యానికి బానిసై కోడలు బైండ్ల స్వాతిని డబ్బులు ఇవ్వాలని వేధించే వాడని, ఆమె డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో 2023 మే 7వ తేదీన మధ్యాహ్నం తన కోడలు స్వాతితో డబ్బులు ఇవ్వాలని గొడవ పడ్డాడు. దీంతో ఆమె డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో తీవ్ర ఆవేశానికి లోనై ఇనుప సలాకతో స్వాతిపై దాడి చేశాడు. దీంతో బైండ్ల స్వాతి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై పాకాల గీత బైండ్ల భోజన్నపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి, చార్జిషీట్ వేశారు. అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌ను కేసును విచారించి బైండ్ల భోజన్నకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు.

తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరు..

• జిల్లా ఎస్పీ జానకి షర్మిల

ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ సమాజంలో తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. ఎవరైనా సరే చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుంటే శిక్ష తప్పదన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు నిబద్ధత, నిజాయితీగా విచారణ చేసి తప్పు చేసిన వారికి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని చెప్పారు. నర్సాపూర్(జి) కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషిచేసిన వై.రమణ రావు, అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి పాకాల గీత, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై డల్లు సింగ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ మహేందర్‌సింగ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అంకితభావంతో పనిచేయాలి: డీఎంహెచ్‌వో


యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పెంబి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సిబ్బంది అంకితభావంతో పని చేయాలని డీఎంహెచ్‌వో రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సిబ్బంది అందరూ కూడా అంకిత భావంతో పని చేయాలని యాంటీ బయోటిక్ మందులను సరైన అవసరం మేరకు, సరైన మోతాదులో, సరైన సమయం వరకు ఉపయోగించాలని, అతిగా యాంటీ బయోటిక్ ఉపయోగించడం వల్ల డ్రగ్ రెసిస్టెన్స్ రావడం వల్ల వ్యాధులు తగ్గకుండా ఇన్ఫెక్షన్ తీవ్రత పెరిగి మరింత మందికి వ్యాపించవచ్చన్నారు. మరణానికి కారణం కావచ్చునని, అందుకని వైద్యుల సలహా మేరకు, వైద్యులు సూచించిన విధంగా మందులను ఉపయోగిం చాలని తెలిపారు. ప్రజల్లో విస్తృతంగా వారం పాటు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు, సిబ్బందితో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మీడియా, విస్తరణ అధికారి బారె రవీందర్, డీపీహెచ్ఎన్‌వో సాయమ్మ, డాక్టర్ శివ కుమార్, డాక్టర్ శాంతన్ రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సహాయకులు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నీకి ఎంపిక


విద్యార్థి బి. కృష్ణను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలురు) విద్యార్థి బి. కృష్ణ 8వ తరగతి చదువుతున్నాడు. వాలీబాల్ అండర్-14లో డిసెంబరు నెలలో 10 నుంచి 15వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపిక కావడం జరిగింది. ఈ ఎంపిక పట్ల నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, గిరిజన అభివృద్ధి అధికారి జే.అంబాజీ, పాఠశాల హెడ్ మాస్టర్ ఎస్. అనూష, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు బి.కృష్ణను సన్మానించి అభినందించారని నిర్మల్ జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ భూక్యా రమేష్ తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న ఊర కుక్కలు

- భయాందోళనలో ప్రజలు



గుంపుగా తిరుగుతున్న వీధి కుక్కలు

ముథోల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఊర కుక్కలు ఒకటా.. రెండా వందలాదిగా రోడ్లపై తిరు గుతూ ఇటు బాటసారులను అటు వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. అంతేకాకుండా మేక పిల్లలను సైతం కుక్కలు దాడి చేస్తున్నాయి. మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కుక్కల బెడద తప్పడం లేదని వాపోతున్నారు. ఏ గ్రామంలో చూసిన ఊర కుక్కలు దారిన వెళ్లే వారిపై దాడులు చేయడం, మోటార్ సైకిల్‌పై వెళ్లే వాహనదారుల వెంట పరిగెత్తి కరవడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఈ సమయంలో మోటార్ సైకిల్‌పై వెళ్లే వ్యక్తులు భయపడి అతివేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాల బారిన పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. అంతేకాకుండా గొర్రెలు, మేకలు, పశువులపై దాడి చేయడంతో కొన్ని మృత్యువాత కూడా పడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడి చేసి తీవ్ర గాయాలు చేయడం చేస్తున్నాయి. కుక్కలు కరవడం వల్ల కొందరికి తీవ్ర గాయాలతో పాటు ఆర్థికంగా నష్ట పోతున్నారు. రాత్రి సమయాల్లో విపరీతంగా అరవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. రోడ్ల పైకి ఒకేసారి పదుల సంఖ్యలో ఊర కుక్కలు రావడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు, బాటసారులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు కుక్కల నివారణ చర్యలు తీసుకోకపోవడంతో ఏ గ్రామంలో చూసినా కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగిందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆయా గ్రామాల్లో ఊర కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



ఇందిరమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



బోథ్‌లో ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్

ఖానాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశ అభివృద్ధి కోసం దివంగత ప్రధాని ఇందిరా గాంధీ సేవలు ఎనలేనివని ఖానాపూర్ నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కడార్ల గంగనర్సయ్య అన్నారు. మంగళవారం ఇందిరా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని బాధనకుర్తి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారత దేశం కోసం, నిరుపేదల అభివృద్ధి కోసం ఇందిరమ్మ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఇందిరమ్మ విగ్రహానికి పూలమాల వేసి గ్రామస్థులకు మిఠాయిలను పంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు పౌకత్ బాషా, నాయకులు మైస శ్రీనివాస్, బాణావత్ గోవింద్, షేక్ సమీ, షేక్ అమేర్, షేక్ జియా, తదితరులున్నారు.

బోథ్: భారతదేశ ప్రధానిగా స్వర్గీయ ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలు ప్రజలు మరువలేకపోతున్నారని ఆమె ఉక్కు మహిళని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ప్రధాన మంత్రిగా ఎన్నో సంచలనమైన నిర్ణయాలు తీసుకుని దేశ భవిష్యత్తు కోసం కృషి చేసిందన్నారు. ఆమె తీసుకున్న నిర్ణయాల వల్లనే భారతదేశం అభివృద్ధిలో ముందుకు వెళుతుందన్నారు. దేశ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలను చేపట్టారన్నారు. చివరకు దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహిళా ప్రధానమంత్రి సేవలు ప్రజలు మరిచిపోలేరన్నారు. నేటికీ ఇందిరమ్మ పేరున కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలు ఇందిరమ్మ రాజ్యం కోసం కాంగ్రెస్‌ను గెలిపించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, సహకార సంఘం డైరెక్టర్ జి.రాజు యాదవ్‌తో పాటు రాజశేఖర్, మెరుగు భోజన్న, కురుమే గంగారాం పాల్గొన్నారు.

బాసరలో సామూహిక సత్యనారాయణ పూజలు

బాసర, నవంబర్, 19 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతి అమ్మవారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం సామూహిక సత్యనారాయణ పూజా కార్యక్రమం నిర్వహించారు. రూ.150 టికెట్ అక్షర శ్రీకార మండపంలో హాజరైన భక్తులతో సత్యనారాయణ వ్రత పూజలను ఆలయ పండితులు జరిపించారు. భక్తులకు ఎలాంటి రుసుము లేకుండా పూజా సామానుతో సహా అన్ని దేవస్థానం తరపున ఉచితంగా సమకూర్చారు.



సత్యనారాయణ పూజ నిర్వహిస్తున్న పండితులు



హాజరైన భక్తులు

వరికి మద్దతు ధర ప్రకటించాలి

- ఖానాపూర్‌లో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట న్యూడెమోక్రసీ నాయకుల నిరసన

ఖానాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 5,428 మద్దతు ధరను వెంటనే ప్రకటించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సరిగా నిర్వహించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లతో కలిసి రైతుల వద్ద ధాన్యం కటింగ్‌ల పేరిట దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శివరాజ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గోపి నర్సయ్య, దుర్గం లింగన్న, స్వామి, కే.రాజేశ్వర్, గుజ్జుల గజ్జన్న, గూట్ల ప్రసాద్, ఆకుల సత్తన్న, చిన్న రాజన్న, తదితరులున్నారు.

సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులను మంగళవారం ఎంపీ గొడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి నిర్మాణ పనులపై ఆరా తీశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీ గొడం నగేష్, ఎమ్మెల్యే శంకర్

ఆబ్కారి శాఖకు మద్యం బాటిళ్లను అప్పగించిన ఆర్టీసీ అధికారులు



ఆర్టీసీ బస్సులో లభ్యమైన మద్యం బాటిళ్లు

నిర్మల్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వస్తున్న రాజధాని ఏసీ బస్సులో లభ్యమైన 3 వ్యాట్, 69 విస్కీ బాటిళ్లను డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి ఆదేశాల మేరకు ఆబ్కారి శాఖ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, డిపో క్యాషియర్ ఎన్. రాజశేఖర్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సర్ఫరాజ్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖానాపూర్ సబ్ సెంటర్ పరిధిలోని బోరింగ్ గూడ, మారెగాం, తిప్ప ఏజెన్సీ గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో గర్భిణులకు డాక్టర్ సర్ఫరాజ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. నెలలు నిండగానే ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాలని సూచించారు. డాక్టర్ సాయిరామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, ల్యాబ్ టెక్నీషియన్ సుష్మ, హెల్త్ అసిస్టెంట్ పవర్ ప్రేమ్ సింగ్, రాథోడ్ నారాయణ్, సత్యవతి, పవర్ శైలజ, ప్రవీణ్ ఉన్నారు.

చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డు నెంబర్ 2 నాయుడువాడకు చెందిన గోదావరి అనే మహిళలకు వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన రూ.50,000ల చెక్కును మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్ సాధం స్వప్న అరవింద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి సుభాష్ పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

సోన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి రైతులు మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి అన్నారు. మంగళవారం సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోందని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బర్మ గంగాదాస్, డైరెక్టర్లు సాధ విజయ్, ముత్తన్న, సీఈవో శ్రీహరి, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ పరిశీలన



రాచాపూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్

లక్ష్మణచాంద, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచాపూర్ గ్రామంలో అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. స్థానికంగా గల వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్‌వో కిరణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



కుంటాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కుంటాల, నవంబర్ 19 (ఆంధ్ర జ్యోతి): కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండల కేంద్ర కుంటాలలో మంగళవారం సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపడుతున్న వరి ధాన్యం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా ఉంచాలని, రైతులకు టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్రంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కేంద్రం నుంచి తరలించి రైతుల ధాన్యం వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసినట్లయితే సరైన సమయంలో రైతులకు డబ్బులు అవకాశం ఉందని నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈయన వెంట సీఓ నాగభూషణ్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్యంతో చదివి ఉన్నతులుగా ఎదగండి



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

బోథ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా లక్ష్యం సాధించే దిశగా చదవాలని మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సెల్ఫ్ గవర్నమెంట్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి వారి తరగతి గదుల్లో విద్యాబోధన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి హాజరై మాట్లాడారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఆదర్శంగా తీసుకొని చదవాలన్నారు. ఒకప్పుడు ఇదే పాఠశాలలో చదివి ప్రస్తుతం పాటశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ ఉన్నత లక్ష్యంతో చదివి ఈ స్థాయికి వచ్చిందన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ సంగీత మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివి ఈ ప్రాంతంలోనే ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లత, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మాధవితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాటానికి ముస్లింల మద్దతు



రిలే నిరాహార దీక్ష శిబిరంలో ముస్లింలు

దిలావర్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న పోరాటానికి దిలావర్‌పూర్ ముస్లిం మైనార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మంగళవారం రిలే నిరాహార దీక్ష శిబిరానికి చేరుకున్న మైనార్టీలు ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. ఉద్యమకారులతో కలిసి నడుస్తామన్నారు. పోరాటంలో పాలుపంచుకుంటామన్నారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు అన్వర్ మౌల్ సహాబ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షఫీఉద్దీన్, ఉపాధ్యక్షుడు సలీం, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

కుంటాల, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సర్వే కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు గ్రామంలో చేపడుతున్న సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నవీన్, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రావు, పంచాయతీ సెక్రటరీ భోజన్నలు చేపడుతున్న సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని ఆదేశించారు.



కల్లూరు గ్రామంలో సర్వే పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

నిషేధం ఉత్తిదేనా?

(5వ పేజీ తరువాయి...)

మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. వాటి వల్ల పొంచి ఉన్న భయంకర వ్యాధుల గురించి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవగాహన లేకపోవడంతోనే మత్తు పదార్థాల వినియోగానికి అడ్డూఅదుపు లేకుండా పోతోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్లో మరింత విస్తృతంగా అవగాహన కల్పించి గుట్కా, మత్తుపదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంచాయతీ రికార్డులు గల్లంతు

- అడ్డగోలుగా ఆక్రమణలు

బోథ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. మండల కేంద్రంలో వ్యాపారాలు రోడ్లపై కొనసాగుతుండగా ఖాళీస్థలాలు ఇష్టానుసారంగా ఆక్రమణలకు గురవుతు న్నాయి. మురికి కాలువలపైన వ్యాపార సంస్థలు వెలుస్తుండంతో ప్రభుత్వ భూమి దేవాదాయ శాఖ వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్న భూములను సైతం స్వాహా చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో సరైన రికార్డులు లేకపోగా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ ఉండటంతో కబ్జాదారులదే పైచేయిగా నిలుస్తున్నదన్న విమర్శలు వస్తున్నాయి. అనుమతులు లేకుండా మూడంతస్తుల భవనాలు నిర్మాణం కొనసాగుతుండటం కల్లేదుట జరుగుతున్నా అధికారు లు స్పందించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. అధికారుల చేతులు తడుపుతూ యథేచ్ఛగా ఆక్రమణలను కొనసాగిస్తున్నారు. మరికొంత మంది రోడ్లపైనే స్థలాలను ఆక్రమించుకుని ఇతరులకు వ్యాపార సంస్థల వారికి లీజుకు ఇస్తున్నారు అన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికారులు బోథ్‌లో జరుగుతున్న ఆక్రమణలపై దృష్టి సారించినట్లయితే మరిన్ని ఆక్రమణదారుల అవినీతి భాగోతం బయటపడే ఆస్కారం ఉంది.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నిర్మల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని పంచగుడి వంతెన వద్ద ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాటాడుతూ ప్రతిఒక్కరూ వెహికల్‌కు సంబంధించిన నిజమైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఒకవేళ మద్యం తాగి వాహనాలు నడిపినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని, కేసు నమోదు చేసి కోర్టు హాజరుపరచడం జరుగుతుదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు



విజయోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

సోన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముజ్గి గ్రామంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను ముజ్గి గ్రామ పంచాయతీ, పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గజానన్‌రావు, కాంగ్రెస్ నిర్మల్ మండల అధ్యక్షులు ఎంబరి గంగాధర్, పంచాయతీ సెక్రటరీ సరిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధీర్, తెలంగాణ సాంస్కృతిక కళాబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శశికాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. మెడికల్ అలవెన్స్ రూ.600 నుంచి రూ.3 వేలకు పెంచాలన్నారు. సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీలో 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు.

మాలల సింహ గర్జన విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

బోథ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొప్పుల రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బస్టాండ్ వద్ద మాల సింహగర్జనకు సంబంధించిన పోస్టులను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటానికి మాలలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుధీర్, సుభాష్, గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న, అశోక్, కిరణ్‌కుమార్, బోథ్ మండ ల మాల సంఘం అధ్యక్షులు ఎలుక రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య సేవలు అందితేనే ప్రయోజనం

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఉచితంగా ఆరోగ్య సేవలందించినప్పుడే మేలు జరుగుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్యం కోసం ఆస్పత్రిలో చేరిన వారికి పూర్తి సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని 52 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేపీ కౌన్సిలర్‌లతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

నూతన మండల వ్యవసాయ అధికారికి సన్మానం

పెంబి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల వ్యవసాయ అధికారి నవీన్‌కు మంగళవారం మండల తాజా మాజీ సర్పంచ్‌లు, నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉన్న రైతులకు అందుబాటులో ఉంటూ వారి వ్యవసాయ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తానాజీ, మహేందర్, సుదర్శన్, రాజు, పెంబి ట్రైబల్ ఎఫ్‌పీవో చైర్మన్ జైహింద్ రెడ్డి, సాబీర్ ఖాన్, వినాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

కుంటాల, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింబా గ్రామంలో దత్తాత్రేయ ఆలయ అభివృద్ధి కోసం రూ. 51 వేలను విరాళంగా అందజేశారు. కుబీర్ మండలం చాత గ్రామానికి చెందిన కులకర్ణి సుభాష్ మంగళవారం ఈ విరాళాన్ని అందజేయగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

• సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం

నిర్మల్‌కల్చరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణం హరిహర క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సదాశివ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమానికి నిర్మల్ సమీప ప్రాంతాలతోపాటు పలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. ఆలయధర్మకర్త అల్లోల వినోదమ్మ మురళీధర్‌రెడ్డితోపాటు గురుస్వామిమూర్తి, కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు గావించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.


సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం



పాల్గొన్న భక్తజనం

పంచాయతీ రికార్డులు గల్లంతు !

• అడ్డగోలుగా ఆక్రమణలు



బోథ్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. మండల కేంద్రంలో వ్యాపారాలు రోడ్లపై కొనసాగుతుండగా ఖాళీ స్థలాలు ఇష్టానుసారంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. మురికి కాలువలపైన వ్యాపార సంస్థలు వెలుస్తుండంతో ప్రభుత్వ భూమి దేవాదాయ శాఖ వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్న భూములను సైతం స్వాహా చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో సరైన రికార్డులు లేకపోగా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ ఉండటంతో కబ్జాదారులదే పైచేయిగా నిలుస్తున్నదన్న విమర్శలు వస్తున్నాయి. అనుమతులు లేకుండా మూడంతస్తుల భవనాలు నిర్మాణం కొనసాగుతుండటం కల్లెదుట జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని పలువురు పేర్కొంటు న్నారు. అధికారుల చేతులు తడుపుతూ యధేచ్ఛగా ఆక్రమణలను కొనసాగిస్తున్నారు. మరికొంత మంది రోడ్లపైనే స్థలాలను ఆక్రమించుకుని ఇతరులకు వ్యాపార సంస్థల వారికి లీజుకు ఇస్తున్నారు అన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికారులు బోథ్‌లో జరుగుతున్న ఆక్రమణలపై దృష్టి సారించినట్లయితే మరిన్ని ఆక్రమణదారుల అవినీతి బాగవంత బయటపడే ఆస్కారం ఉంది.



సాగునీరు అందించని సాలెవాడ (బీ) చెరువు

• నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం • పని చేయని తూములు • పట్టించుకోని అధికారులు

ఉట్నూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల రైతులకు సాగునీరు అందించడానికి నిర్మించిన సాలెవాడ (బీ) చెరువు సాగునీరు అందించలేక పోవడంతో గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉట్నూర్ మండలంలోని సాలెవాడ(బీ) గ్రామ పంచాయతీ పరిధిలో తాండ్ర త్రోవలో నిర్మించిన సాలెవాడ చెరువు ద్వారా 100 ఎకరాల భూములకు సాగునీరు అందిస్తామని అధికారులు ప్రణాళికలు చేసి 1990 ప్రాంతంలో చెరువు నిర్మించారు. వాగునీరు వచ్చే మార్గంలో చెరువు నిర్మిస్తే రైతులకు ప్రయోజనంగా ఉండేది. కానీ చిన్న తరహా నీటిపారుదల శాఖ అధికారులు సరైన ప్రణాళికలు చేయకపోవడంతో మైదాన ప్రాంతంలో చెరువు నిర్మించారు. ఫలితంగా చెరువు ఉన్న ప్రయోజనం లేకుండా పోతుందని గిరిజన రైతులు పేర్కొంటున్నారు.

నాలుగు దశాబ్దాలుగా నిష్ప్రయోజనమే...

సాలెవాడ బీ, తాండ్ర, ఓల్వాడ ప్రాంతాల రైతులకు సాగునీరు అందించడానికి లక్షల రూపాయలతో నిర్మించి నాలుగు దశాబ్దాలు అవుతున్న చెరువు నిష్ప్రయోజనంగా మారిందని గిరిజన రైతులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలోని రైతులు పత్తి, సోయాబీన్ పండిస్తూ అనధిగా జీవిస్తున్నారు. వాణిజ్య పంటలతో పాటు ఆహార పంటలు పండించుకోవడానికి వీలు కలిగించేలా నిర్మించిన చెరువుతో ఏ మాత్రం ప్రయోజనం లేదని, చెరువు తూములు చెడిపోయినా పట్టించుకునేవారు లేరని రైతులు వాపోతున్నారు. వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలకు నిండుతున్న చెరువు తూములో బాగులేక చెరువు నీరు వృధాగా పోతుందని, చెరువు కట్ట ఎత్తు పెంచాలని రైతులు పేర్కొంటున్నారు. చేపట్టాలని గిరిజన రైతులు కోరుతున్నారు.


తూము సారిగా లేకపోవడంతో వృథా అవుతున్న చెరువు నీళ్లు

మరమ్మతులు చేపట్టాలి



• మేస్రం నాగోరావు సాలెవాడ(బి)

ఉట్నూర్ ఐటీడీఏ చిన్నతరహా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన సాలెవాడ బీ చెరువుకు మరమ్మతులు చేపట్టాలి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చెరువు ద్వారా ఏ మాత్రం ప్రయోజనం లేకపోయింది. తూములు మరమ్మతులు చేయడంతో పాటు కట్ట ఎత్తు పెంచితే బాగుంటుంది.

ప్రతిపాదనలు పంపిస్తాం



• రాథోడ్‌వినోద్, డీఈఈ

సాలెవాడ(బి) చెరువు మరమ్మత్తుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తా. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తాం.

ట్రాన్స్‌ఫార్మర్లకు కష్టాలు!

• ఓవర్ లోడ్‌తో కాలిపోతున్న విద్యుత్ నియంత్రికలు • సొంత ఖర్చులతో బాగు చేయించుకుంటున్న రైతులు

బోథ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు వేధిస్తున్నాయి. రబీ పంటలకు నీరందిస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని వివిధ గ్రామాలకు చెందని రైతులు వాపోతున్నారు. రబీ పంటలకు సాగునీరు అందిస్తున్న సమయంలో ఓవర్ లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే సంబంధిత విద్యుత్ శాఖ కార్యాలయానికి రైతులే ట్రాన్స్‌ఫార్మర్లను ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి తీసుకువెళ్లాల్సి వస్తుందని రైతులు పేర్కొటున్నారు. రైతుల జేబులో నుంచి డబ్బులు పెట్టి ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువెళితే 15 రోజుల వరకు ట్రాన్స్‌ఫార్మర్లను ఇవ్వడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. గత వారం రోజుల క్రితం మండలంలోని పార్డీ ప్రాంతంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ రైతులు తమ సొంత ఖర్చులతో ఆదిలాబాద్‌కి తీసుకువెళ్లి అక్కడి ఇచ్చిన ట్రాన్స్‌ఫార్మర్ బిగించగానే కాలిపోయింది. ఈ విషయాన్ని సంబంధిత విద్యుత్ శాఖ తెలపడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువెళ్లడం, తేవడం కోసం అయ్యే ఖర్చులను రైతులే భరించాల్సి వచ్చింది.



అధికారుల మాటలే.. నీటి మూటలే..

ట్రాన్స్‌ఫార్మర్ లేకపోతే దాని స్థానంలో గతంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు 24గంటల్లోపు ఇచ్చేవారని రైతులు చెప్తున్నారు. ఇప్పుడు మాత్రం ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులకు తీసుకువెళితే 15 రోజుల వరకు ఇవ్వలే మని అధికారులు చెప్తున్నారని ఆరోపిస్తున్నారు. ఫలితంగా సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు అంటున్నారు.

ఏఈ లేక అవస్థలు

మండలానికి విద్యుత్‌శాఖ ఏఈ లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యుత్ శాఖ ఏఈ బదిలీపై వెళ్లిపోయి నెల రోజులకుపైగా కావస్తున్నా ఏఈ నియామకం జరగకపోవడంతో విద్యుత్ శాఖ సమస్యల పరిష్కారానికి ఆటంకం ఏర్పడుతుంది. అధికారులు మండల విద్యుత్‌శాఖ ఏఈని నియమించాలని రైతులు కోరుతున్నారు.



వాగు నీటిని మోటార్ల ద్వారా సాగుకు వినియోగిస్తున్న రైతులు


పత్తి పంట తడికి తుంపర్లా సేద్యం చేస్తున్న రైతులు

పంటలను కాపాడుకునేందుకు
రైతుల భగీరథ యత్నం

బోథ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పత్తి రైతులకు సాగు నీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పత్తి పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. అయితే ప్రస్తుతం పత్తి పంటకు నీటితడులు అవసరం కావడంతో పంటను రక్షించుకునేదుకు రైతులు నీటి వనరుల వినియోగానికి ఇబ్బందులు పడుతున్నారు. పంట చేల పక్కలో ఉన్న వాగుల్లో నీటిని వినియోగించుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. నీటి వసతి లేక రైతులు ఆయిల్ ఇంజన్లను ఏర్పాటు చేసుకొని నీటి తడులు పెట్టుకోవాల్సి వస్తోంది. నీటితడి లేకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. నీటి వసతి ఉన్న రైతులు తుంపర్లాతో సేద్యం చేస్తున్నారు. పగలు, రాత్రి రైతులు నీటి తడులు పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వర్షాలు కురవకపోతే రైతులు కొంత మంది నీటి వసతి లేక పంటలు నష్టపోయే ప్రమాదం ఉంది. ఏదిఏమైనా పంటసాగు రైతన్న భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు!



• రంజినిలో అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు పనులు

• ప్రమాదాల బారిన వాహనదారులు • పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు

కుభీర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు పూర్తి చేయడం లేదు. పనులు ప్రారంభించి కొంతమేర కంకర పోసి వదిలేశారు. దీంతో స్థానికులకు రవాణాకష్టాలు పెరిగి ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని గిరిజన ప్రాంతమైన రంజిని గ్రామం నుంచి జాంగామ్ గ్రామ శివారు వరకు 3.2కిలో మీటర్ల తారురోడ్డు నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ. కోటి 80 లక్షలు మంజూరయ్యారు. ఈ పనులు దక్కించున్న గుత్తేదారు 2023 మేలో పనులు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాల్సి ఉన్నా.. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుత్తేదారు పనులు చేయడం లేదు. దీంతో కంకర వేసిన రోడ్లపై వెళ్లే వాహనాదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తారురోడ్డు నిర్మాణంతో సౌకర్యంగా మారుతుందని ఆశించినా జనాలకు మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టింది. పనులు పూర్తి చేసేలా చొరవ చూపాలని అధికారులకు, పాలకులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తారో రోడ్డు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదాల బారిన వాహనదారులు


• బాలాజీ, రంజిని గ్రామవాసి

రోడ్డు పనులు చేపట్టిన గుత్తేదారు సుమారు సంవత్సరన్నర క్రితం కంకర వేసి వదిలేశాడు. దీంతో నడిచి వెళ్లేందుకు సైతం వీలు లేకుండా పోయింది. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో ఇప్పటివరకు ద్విచక్రవాహనదారులు పదులసంఖ్యలో ప్రమాదాలు జరిగి గాయాల పాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుత్తేదారుతో పనులు పూర్తి చేయించాలి. లేకుంటే మున్ముందు మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

త్వరలో పనులు చేపట్టేలా చర్యలు

• ప్రదీప్, ఐటీడీఏ జేఈ

రంజిని నుంచి జాంగామ్ శివారు వరకు నిలిచిపోయిన రోడ్డు పనులను త్వరలో చేపట్టేలా సంబంధిత గుత్తేదారులపై చర్యలు తీసుకుంటాం. పనులు సకాలంలో పూర్తి చేయాలని రెండు సార్లు నోటీసులను అందజేశాం. మరోమారు నోటీసులు జారీ చేస్తాం. పనులు చేపట్టక పోతే టెండర్‌ను రద్దు చేసి మరో గుత్తేదారుతో సకాలంలో పనులు పూర్తి చేసి గ్రామస్తులకు సౌకర్యం కల్పిస్తాం.



పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి) పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయా ఇళ్లలో అపరిశుభ్రంగా, నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఎక్కడంటే అక్కడ చెత్తాచెదారం పడేయవద్దని, నీరు నిల్వ ఉన్నచోట దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



● పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన నిషేధిత గుట్కా నిల్వలు(ఫైల్)



నిషేధం.. ఉత్తిదేనా?

- జిల్లాలో గుట్టుగా సాగుతున్న గుట్కా విక్రయాలు
- యథేచ్ఛగా మహారాష్ట్ర నుంచి భారీగా దిగుమతులు
- సరిహద్దు చెక్‌పోస్టుల్లో కొరవడుతున్న నిఘా
- ధరలు పెంచి మరీ దండుకుంటున్న వ్యాపారులు
- నిషేధం పేరిట బ్లాక్ మార్కెట్‌లో జోరుగా అమ్మకాలు
- మామూలుగానే తీసుకుంటున్న అధికారులు
- అమలుకు నోచుకోని కోప్టా చట్టం

ఆదిలాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజుల క్రితమే రాష్ట్ర వ్యాప్తంగా గుట్కా మత్తుపదార్థాలను నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. అయినా నిషేధిత మత్తుపదార్థాల దందాకు అడ్డుకట్ట పడినట్లు కనిపించడం లేదు. జిల్లాలో గుట్కా వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. నిషేధం విధించడంతో వ్యాపారులు మరింతగా రెచ్చిపోయి అడ్డదారి సంపాదనకు ఎగబడుతున్నారు. ధరలను భారీగా పెంచేసి అందినకాడికి దండుకుంటున్నారు. నిషేధం పేరిట బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు జరుపుతున్నారు. ఒక్కో ప్యాకెట్ రూ.15 నుంచి రూ.20 వరకు అమ్మేస్తున్నారు. అధికారులు, పోలీసులు అడపాదడప తనిఖీలు చేస్తూ పలువురిపై కేసులు నమోదు చేస్తున్నా.. అక్రమ గుట్కా దందాకు అడ్డుకట్ట పడడం లేదు. గుట్కా నిషేధంపై వ్యాపారులు కోర్టును ఆశ్రయించడంతో.. పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేక పోతున్నామన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పొగాకు ఆధారిత మత్తు పదార్థాల నియంత్రణకు 2004లో కోప్టా చట్టాన్ని తీసుకొచ్చినా.. అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు అడపాదడప తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నా.. పూర్తిస్థాయిలో నియంత్రించలేక పోతున్నారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంతో పాటు ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బోథ్ మండలాల్లో భారీగా గుట్క, మత్తు పదార్థాలను నిల్వ చేస్తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పోలీసులు దాడులుచేసి పలువురిపై కేసులు నమోదు చేసిన ఫలితం లేకుండానే పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. గుట్కాతో ప్రాణాంతక వ్యాధుల భారీన పడి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అయినా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అధికార యంత్రాంగం కట్టడి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం..

: డా.శ్రీధర్, ఫుడ్‌సేఫ్టి అధికారి, ఆదిలాబాద్

గుట్కా మత్తుపదార్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటు న్నాం. గుట్కాతో కలిగే నష్టాలపై కళాజాతా బృందాలు, ప్రచార పోస్టర్లను ఏర్పాటు చేస్తాం. త్వరలోనే ప్రత్యేకంగా జిల్లా కమిటీని ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. గుట్కా అమ్మకాలపై జరిమానాలు విధిస్తున్నాం. ప్రజల్లో అవగాహన వస్తేనే మత్తుపదార్థాల నియంత్రణకు అవకాశం ఉంటుంది.

కొరవడుతున్న నిఘా

జిల్లాకు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి భారీగా నిషేధిత మత్తు పదార్థాల దిగుమతి కొనసాగుతున్నా.. సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా కొరవడుతోంది. కాసుల కోసం కక్కుర్తి పడి చెక్‌పోస్టు అధికారులు కళ్లు మూసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రాత్రి వేళల్లో భారీగా దిగుమతి చేసుకుంటూ.. పగలంతా జిల్లా అంతటా సరఫరా చేస్తూ విక్రయాలు నిర్వహిస్తున్నారు. పకడ్బందీగా తనిఖీలు చేస్తే జిల్లాలోకి ఎలాంటి గుట్కా, మత్తు పదార్థాల దిగుమతికి అవకాశం ఉండదు. కానీ అంతటా మామూళ్ల మాయనే కొనసాగడంతో ఈ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. జిల్లా సరిహద్దుల్లో ఉన్న జైనథ్ మండలంలోని బోరజ్, తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్, బేల శంకర్‌గూడ, బోథ్ ఘన్‌పూర్ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు లేకనే యథేచ్ఛగా గుట్కా రవాణా సాగుతున్నట్లు తెలుస్తోంది. నిత్యం కోట్లలో వ్యాపారం కొనసాగడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతోందంటున్నారు. చెక్‌పోస్టు అధికారులు సరైన దృష్టి సారిస్తే అక్రమ దందాకు అడ్డుకట్ట పడనుంది.

న్యాయపరమైన చిక్కులు

గుట్కా వ్యాపారంపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా.. న్యాయపరమైన ఇబ్బందులతో పోలీసులు ఏమీ చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నా.. కోర్టుల్లో నిలబడడం లేదన్న వాదన లు వినిపిస్తున్నాయి. దీంతో గుట్కా దందాను చూసీచూడనట్లుగానే వ్యవహరించాల్సి వస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాడులు నిర్వహిస్తూ గుట్కా పదార్థాలను స్వాధీనం చేసుకోవడం.. ఆపై వ్యాపారులపై కేసులు నమోదు చేస్తూ వదిలేయాల్సి వస్తోంది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై ఉక్కు పాదం మోపాల్సి ఉంది. కానీ పోలీసుల చర్యలకు న్యాయపరమైన ఇబ్బందులు అడ్డు రావడంతో ఈ దందా అంతం కావడం లేదంటున్నారు. ముఖ్యంగా జర్దా, తంబాకు,

(తరువాయి 6వ పేజీలో...)



విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● జైనథ్ మండలం మేడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రామస్థులు, విద్యార్థులతో సమావేశం



మేడిగూడలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా



జెండా ఊపి ప్రచార రథాలను ప్రారంభిస్తూ..



ఝరిలో కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

జైనథ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రామస్థులు విద్యార్థులతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు అన్ని పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. విద్యార్థులు మంచి ఆరోగ్యపు ఆలవాట్లను అలవర్చుకోవడంతో పాటు కష్టపడికాకుండా ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ఇందులో జిల్లా వైద్యాధికారి నరేందర్‌రాథోడ్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో జి.వెంకట్‌రాజ్, ఎంఈఓ జి.శ్రీనివాస్, వీడీసీ చైర్మన్ కె.రాంరెడ్డి, సీడీపీఓ సురేఖ, మేడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యవాన్‌చిక్లెలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ప్రజాపాలన రథాలను ప్రారంభించిన కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన-ప్రజా విజయోత్స వాలను ఈ నెల 19 నుంచి డిసెంబరు 7 వరకు విజయవంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద ప్రచార రథాలను అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజాపాలన కళాయాత్ర సమాచార పౌరసంబంధాల శాఖ జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో ప్రజా విజయోత్సవాలపై ప్రచారం చేయనున్నారు.జిల్లాలోని మండలాలు, ఆయా గ్రామాల్లో, మున్సిపాలిటీలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు మహాలక్ష్మి, ఇందిరా మహిళశక్తి, గృహజ్యోతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్ల పై ప్రచారం చేయనున్నారన్నారు. ప్రతీ మండలం నుంచి మూడు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ వెంకటేశ్వర్లు, డీపీఆర్ఓ తిరుమల, టూరిజం ఆఫీసర్ పార్థసారథి, రవీందర్, అశోక్, తెలంగాణ సాంస్కృతిక కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

● రక్తదానం చేసిన రాజర్షిషా

నార్నూర్(ఆంధ్రజ్యోతి): గాదిగూడ మండలం ఝరి గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గొండ్వానా పంచాయతీ రాయిసెంటర్ ఉద్యోగులు, యువత ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదానం చేశారు. అంతకుముందు కలెక్టర్‌ను ఆదివాసీ ప్రజలు సంఘాల నాయకులు భాజాభజంత్రీల నడుమ ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా ఆరోగ్య కేంద్రం వరకు తీసుకువచ్చారు. కాగా 215 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం గమనార్హం. ఇందు లో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్, మలేరియా అధికారి, మేస్రం దుర్గ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు దౌలత్‌రావు, కొడపజాకు, మేస్రం లింగు, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మేస్రం రూప్‌దేవ్‌పటేల్, వక్ఫ్ బోర్డు మాజీ రాష్ట్ర చైర్మన్ తొడసం నాగోరావు, వైస్ ఎంపీపీ యోగేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లను అందజేసిన జిల్లా ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జైనథ్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని జైనథ్, బేల పోలీసు స్టేషన్‌లలో నమోదైన కేసులలోని బాధితులు పోగొట్టుకున్న 24 మొబైల్‌ఫోన్‌లను సీఈఐఆర్ ద్వారా కనుకొని మంగళవారం జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం చేతుల మీదుగా బాధితులకు అందించారు. జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తిరిగి అందించే విధంగా కార్యాచరణ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై డి.రాధిక, ఏఎస్ఐ సిరాజ్‌ఖాన్, సంజీవ్‌కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం



జైనథ్‌లో స్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

హన్మంత వాహనంపై ఊరేగిన లక్ష్మినారాయణ స్వామి

జైనథ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జైనథ్ మండల కేంద్రంలో గల శ్రీలక్ష్మినారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి హన్మంత వాహనం చిన్న రథంపై డప్పుల భజాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జైనథ్ హనుమాన్ ఆలయం వరకు డప్పుల భజాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇందులో ఆలయ కమిటీ చైర్మన్ అడ్డిరుకేష్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వహణాధికారి పి.వామన్‌రావ్, ఆలయ ప్రధాన అర్చకులు డి.దీరజ్ కుమార్, వెంకయ్య, ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి వెళ్లి సమగ్ర సర్వే చేపట్టాలి : అదనపు కలెక్టర్

తలమడుగు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో చేపడుతున్న సర్వే పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఇంటింటికీ అధికారులు వచ్చినప్పుడు కావాల్సిన సమాచారాన్ని అందించాలన్నారు. అదేవిధంగా సర్వే నిర్వహిస్తున్న అధికారులు ఒకే ఇంటి వద్ద ఉండకుండా ప్రతీ ఇంటింటికి వెళ్లాలన్నారు. అనంతరం సుంకిడి గ్రామంలో ఇప్పటి వరకు 50 శాతం సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించడం జరిగిందని పంచాయతీ సెక్రటరీ సచిన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మగ్గిడి ప్రకాష్, పంచాయతీ సెక్రటరీ సచిన్, తదితరులు పాల్గొన్నారు.



సుంకిడిలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



నారాయణ్‌పూర్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

● ఇంటింటి సర్వేను పరిశీలించిన స్కాలర్

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన స్కాలర్‌దీప్తి బత్తిని పరిశీలించారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని పులిమడుగులో నిర్వహిస్తున్న ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని, సర్వే తీరును పరిశీలించారు. ఎన్యుమరేటర్ రవీందర్‌తో పాటు ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్,ఎంపీఓ మహేష్‌కుమార్ తదితరులున్నారు.

● సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను పకడ్బందీగా చేయాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మంగళవారం నేరడిగొండ మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామంలో జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. కచ్చితంగా ప్రతీఒక్క కుటుంబ సభ్యుల ద్వారా విషయాలు సేకరించి నిక్షిప్తం చేయాలన్నారు. ఇందులో ఎన్యూమరేటర్, తదితరులు ఉన్నారు.

● సర్వేకు ప్రజలు సహకరించాలి

తాంసి(ఆంధ్రజ్యోతి): గత 12రోజుల నుంచి తాంసి మండలంలో ఆయా గ్రామాలలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి కోరారు. కుటుంబ సమగ్ర సర్వేలో భాగంగా మంగళవారం మండలంలోని పాలోడి, జామిది, పొన్నారి గ్రామాలలో ఆయన పర్యటించారు. సర్వే సిబ్బంది ప్రజల నుంచి ఎలాంటి వివరాలు సేకరిస్తున్నారో? క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా సర్వే సిబ్బంది అడిగే ప్రశ్నలకు కుటుంబ పెద్ద ఎలాంటి సమాధానాలు చెబుతున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల అనుసారం సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా సర్వే సిబ్బది వారి వారి విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కోరారు.